క్లుప్తంగా

నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: రాయపోల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయపోల్ ఫీడర్‌పై విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదని చెప్పారు. ఈ అసౌకర్యాన్ని గమనించి గ్రామ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తపాలా సేవలపై అవగాహన

ఆమనగల్లు: పట్టణంలోని సబ్ పోస్టాఫీసులో ఈనెల 14న డాక్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా తపాలా సేవలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అదనపు పోస్టుమాస్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని సబ్ పోస్టాఫీసులో బుధవారం ఆయన మాట్లాడుతూ... పోస్టాఫీస్‌ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు గురించి వివరిస్తామని తెలిపారు. రూ.399, రూ.396లతో బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. సదస్సుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎక్సైజ్ సీఐకి సన్మానం



సీఐని సత్కరిస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్

ఆమనగల్లు: ఎక్సైజ్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బద్యానాయక్ చౌహాన్‌ను బుధవారం పలువురు ప్రజాప్రతినిధుల సత్కరించారు. సీఐను కడ్తాల్ జెడ్పీటీసీ సభ్యులు దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా బెల్లం విక్రయాలకు అనుమతి ఇవ్వాలని వారు సీఐని కోరారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితీ అధ్యక్షుడు వీరయ్య, నాయకులు నర్సింహా, జంగయ్యగౌడ్, లాయక్‌అలీ, వినోద్, సతీష్, మహేశ్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మొదటి బహుమతి గెలుచుకున్న టీం

ఆమనగల్లు: మండలంలోని అవురుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహించిన జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆమనగల్లు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. క్రీడల్లో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్–14బాలుర విభాగంలో ఆమనగల్లుకు మొదటి బహుమతి, బాలికల విభాగంలో ఆమనగల్లుకు రెండవబహుమతి, అండర్–17 బాలికల విభాగంలో ఆమనగల్లుకు రెండవ బహుమతి లభించింది. గెలుపొందిన టీంలకు ఎంఈఓ సర్దార్‌నాయక్ బహుమతులు అందజేశారు.

గద్దర్ కుమార్తెను కలిసిన నాయకులు



వెన్నెలను సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి విచ్చేసిన గద్దర్ కుమార్తె వెన్నెలను స్థానిక నాయకులు బుధవారం కలిశారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో గద్దర్ అభిమాన సంఘం అధ్యక్షుడు సీఎల్ యాదగిరి,భిక్షపతి, నర్సింహా, సుమన్‌నాయక్, శ్రీను, నయీం, మహేందర్, అంజనేయులు పాల్గొన్నారు.

లకోనీస్ లాబోరేటరీ సందర్శన



పరిశ్రమలో తనిఖీలకు వెళ్తున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలోని రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని లకోనీస్ లాబోరేటరీస్‌ను బుధవారం కలెక్టర్ హరీష్ సందర్శించారు . కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు , పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో పాటు డీసీపీ , ఆర్డీఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

‘డబుల్’ జాప్యం!

- నాలుగు నెలల క్రితమే లబ్ధిదారుల ఎంపిక
- ఇప్పటికీ ఇళ్లు పంపిణీ చేయని వైనం
- ఆశగా ఎదురు చూస్తున్న పేదలు
- పట్టించుకోని అధికారులు

మంచాల: లబ్ధిదారులను గుర్తించి నాలుగు నెలలు కావస్తున్నా నేటికి డబుల్ బెడ్రూంలు ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎప్పుడు ఇస్తారోనని ఆశగా ఇళ్లులేని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. మంచాల మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం నోముల రెవెన్యూ పరిధిలోని లింగంపల్లి గేట్ వద్ద గత నాలుగున్నర సంవత్సరాల క్రితం 100, 101 సర్వే నంబర్లలో 2 ఎకరాలు స్థలం గుర్తించారు. అందులో 96 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేశారు.. ఇళ్లు లేని నిరుపేదలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో నోముల గ్రామంలో 85, మంచాలలో 276, లింగంపల్లిలో 96 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 460 దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక అధికారులకు సమస్యగా మారింది. చివరికి లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడానికి అధికారులు ముందుకు వచ్చారు. గ్రామసభల ద్వా రా లాటరీలు తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. నోముల 30, లింగంపల్లి 30, మంచాల 30 ఇళ్లు ఇ వ్వగా, గత ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చెన్నారెడ్డి గూడ గ్రామానికి చెందిన 5 మందికి 5 ఇళ్లు ఇచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతకు ఒక ఇళ్లు కేటాయించారు. ఇలా మండలంలో 96 డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రశాంతంగా ఎంపిక పూర్తి చేశారు.

ఇంకా ఇళ్లు ఇవ్వలేదు..

లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి నాలుగు నెలలు కావస్తున్నా.. నేటికీ ఇంకా ఇళ్లు ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గ్రామాల వారీగా తక్షణమే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ వెంకట్‌ప్రసాద్‌రావు వివరణ కోరగా ఉన్నతస్థాయి అధికాల ఆదేశానుసారంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.



లింగంపల్లి గేట్‌వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

కిరాయి ఇంట్లో ఉంటున్నాం



కిరాయి ఇంట్లో కాలం వెలదీస్తున్నాం. డబుల్ బెడ్రూం ఇళ్లు లాటరీ పద్ధతిలో మాకు వచ్చింది. నాలుగు నెలలుగా ఇంటి కోసం ఎదురుచూస్తున్నాం. గ్రామసభల ద్వారా గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలి.

– ఏర్పుల నాగమణి, మంచాల

వెంటనే ఇవ్వాలి



మంచాల మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ప్రభుత్వం పారదర్శంగా వ్యవహరించాలి. నాలుగు నెలలుగా పట్టించుకోకపోవడం దారుణం. గుర్తించిన పేదలందరికీ వెంటనే ఇళ్లు కేటాయించాలి.

– ఎద్మా నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు

చిరుధాన్యాల్లో ఎన్నో పోషకాలు

హయత్‌నగర్: చిరుధాన్యాల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, పిల్లలకు, బాలింతలకు మంచి పౌష్టికాహారమని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ గీత అన్నారు. పోషణ మాసం సందర్భంగా బుధవారం కుంట్లూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో చిరుధాన్యాలపై బాలింతలకు, గర్భిణిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మిల్లెట్స్‌లో అనేక పోషకాలు ఉన్నాయని వీటిని వాడడం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా దేహదారుఢ్యం పెరుగుదలకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, ఆశవర్కర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం ప్రదర్శనలో గీత, తదితరులు

సంప్రదాయానికి ప్రతీక బోనాలు



బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలిన మహిళలు

పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: సాంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలో బుధవారం నిర్వహించిన మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. బోనాల వేడుకలలో భాగంగా బోనాల కుండలను రంగులతో, పసుపు కుంకుమలతో చూడముచ్చటగా అందంగా అలంకరించుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలు మధ్య ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సర్పంచ్ తులసీరాంనాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, పుల్లయ్యగౌడ్, శ్రీరాములుగౌడ్, కేశవులుగౌడ్, శేషయ్యగౌడ్, నర్సింహగౌడ్, జంగయ్యగౌడ్, సత్తయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, రామస్వామి, రామకృష్ణ, బాలయ్య గ్రామ ప్రజలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు వినాయకుడి విగ్రహాలు

యాచారం: వినాయక చవితి మరో ఐదు రోజుల సమయం ఉండగానే నిర్వాహకులు నగరం నుంచి వినాయకుడి విగ్రహాలను పల్లెలకు తరలిస్తున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై బుధవారం నగరం నుంచి వినాయకుడి విగ్రహాలు భారీగా తరలిపోయాయి. నల్గొండ, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, వినుకొండ ప్రాంతాలకు వినాయకుడి విగ్రహాలు తరలించారు. 5 అడుగుల నుంచి 18 అడుగుల వినాయకుడి విగ్రహాలను తీసుకెళ్లారు. ఈ ఏడాది గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండపాల ఏర్పాటుకు నిధులకు కూడా కొరత ఉండకపోవచ్చు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని యువతకు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న నేతలంతా యువతకు చందాలు ఇవ్వడానికి ఆసక్తితో ఉన్నారు.



పల్లెలకు తరలిపోతున్న వినాయకుడి విగ్రహం

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పపహాడ్ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ బుధవారం ఒక ప్రకటనలతో తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంకు చెందిన కంచకట్ల రుక్కమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి వైద్య ఖర్చులకు రూ. 60 వేలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంజూరు చేయించారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకుడు భాస్కర్ సమక్షంలో బాధితురాలికి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

నేడు ప్రత్యేక పూజలు

ఇబ్రహీంపట్నం: శ్రావణ మాస ఆమావాస్యను పురస్కరించుకొని గురువారం ఇబ్రహీంపట్నంలోని శ్రీ భవాని నాగలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ప్రమాదాల నివారణపై దృష్టి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సాగర్‌రోడ్డు మాల్ నుంచి బీఎన్‌రెడ్డి నగర్ వరకు అతివేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల అమాయక ప్రజలు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల కింద తక్కళ్లపల్లి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్ దంపతుల ఇద్దరు కుమారులు ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ప్రమాదానికి గురి కావడం బాధ కలిగించిందన్నారు. నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

తలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ అభినందనీయమని సర్పంచ శ్రీశైలం అన్నారు. నిరుపేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం మండలంలోని దేవుని పడకల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో గ్రామీణులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేక పోతున్నారని పేర్కొన్నారు. శిబిరంలో 75 మందికి బీపీ, షుగర్ తదితర వ్యాధులకు చికిత్సలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అంజయ్య, అంజిరెడ్డి, నాయకులు భిక్షపతి, శంకర్, రమేష్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



దేవుని పడకల్ వైద్య శిబిరంలో సర్పంచ్, నాయకులు, తదితరులు

జైపాల్‌యాదవ్‌తోనే కల్వకుర్తి అభివృద్ధి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తోనే సాధ్యమని ఆమనగల్లు బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి చేసిన ఆరోపణలను ఖండించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 15 కోట్లు ఎమ్మెల్యే మంజూరు చేయించారని తెలిపారు. జాతీయ నాయకుడిగా చెప్పుకుంటున్న ఆచారి ఆమనగల్లు పట్టణానికి ఏ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మళ్లీ జైపాల్ యాదవ్ విజయం సాధించడం ఖాయమని చెప్పారు.



సయ్యద్ ఖలీల్

ఆఫ్‌లైన్‌లో బదిలీలు నిర్వహించాలని వినతి



జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతీమసింగ్‌కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్‌జీటీలు 2000 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేశారని, వీరు వేల ఆప్షన్లు ఎన్నుకోవడం చాలా కష్టమన్నారు. కావునా ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్ విధానంలోనే కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. లేని పక్షంలో దశల వారీగా రోజుకు 300 మంది ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. జిల్లాలోని అన్ని క్యాడర్ల ఉపాధ్యాయ ఖాళీలను పూర్తిగా ఆన్‌లైన్‌లో పొందుపరిచిన తర్వాతే వెబ్ ఆప్షన్లు పొందుపరచడానికి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పరమేష్, నందిగామ మండల అధ్యక్షుడు రాఘవేందర్, తిరుమలేష్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. .

అధికారుల గైర్హాజరుపై ఆందోళన

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అధ్యక్షతన బుధవారం ఇబ్రహీంపట్నం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల అధికారులు కౌన్సిల్ సమావేశానికి రాకుంటే వార్డుల్లోని సమస్యలు ఎలా పరిష్కరమవుతాయని ప్రశ్నించారు. గతంలో జరిగిన సమావేశంలో విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చామని, ఇప్పటి వరకు ఆ సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్, రెవెన్యూ, ఆరోగ్య తదితర ప్రభుత్వ ప్రధాన శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరుకావడంపై ముక్తకంఠంతో సభ్యులు నిరసనను వ్యక్తం చేశారు. అధికారులు తప్పనిసరిగా హాజరయేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ యాదగిరి, కమిషనర్ రవీంద్రసాగర్‌లు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ స్రవంతి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పురపాలక కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని, ఇంటింటా చెత్త సేకరణ క్రమం తప్పకుండా చేయాలని , డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని కోరారు. తుర్కయంజాల్, రాగన్నగూడలోని నై కాలువ, కుంట సాయిరెడ్డి నగర్, తిరుమల కాలనీ, శ్రీశ్రీ విహార్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లోని కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలు, ఖాళీ కుండీలలోని నీరు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు తావులేదని ,పారదర్శకంగా పనులు చేశారని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పీ.కృపేశ్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో 15వ విడత సామాజిక తనిఖీ గ్రామసభ సమావేశం సర్పంచ్ అరుణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ కృపేష్ విచ్చేసి మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా కూలీలకు కల్పించిన పనులు బాగున్నాయని అన్నారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు వస్తే సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భగీరథ , వార్డు సభ్యులు రమేష్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

ఇబ్రహీంపట్నం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గ సీపీఐ సమావేశం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది ఆ ఉద్యమంలో పాల్గొన్నారని, అదే స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలన్నారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రచారి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు చెప్పారు. సీపీఐ ఆధ్వర్యంలో నాంపల్లి, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభను 17వ తేదీన పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొండిగారి రాములు, ఆ పార్టీ రాష్ట్ర స భ్యులు కావలి నర్సింహ్మా, జిల్లా కార్యవర్గసభ్యురాలు నీలమ్మ, లక్ష్మన్, యాదయ్య, హరిసింగ్‌నాయక్, శివ, ఎస్ లక్ష్మయ్య, సంజీవ, రాజు, పూల యాదయ్య, నవనీత, పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం సీపీఐ కన్వీనర్‌గా ముత్యాల యాదిరెడ్డిని, 28 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

ఆమనగల్లు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె బుధవారం మూడవ రోజుకు చేరింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయమ్మ, పద్మ, అలివేలు, రాజ్యలక్ష్మి, సంధ్య, లక్ష్మమ్మ, శాంతమ్మ, అలివేలు, రజిత, నాగశిరోపాణి, స్వరూప, సువర్ణ, అంజమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కడ్తాల్: అంగన్‌వాడీల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు బుధవారం ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ ఉద్యోగులను చర్చలకు పిలవక పోవడం అప్రజాస్వామికమన్నారు. ఉద్యోగులను మోసం చేస్తూ, ఐసీడీఎస్ మంత్రి హామీ ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు, కనీస వేతనం, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కురుమయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు ఉన్నారు.



ఆమనగల్లులో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమ్మె చేస్తే బెదిరింపులా!

యాచారం: తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరికాదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. వారు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. సమ్మెకు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ తదితర ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఉన్నతాధికారుల ద్వారా బెదిరింపులకు గురి చేయడం తగదన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడిన సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, శ్రీమన్నారాయణ, తావునాయక్, పాండుచారి, రాజ్యలక్ష్మి, యాదమ్మ, అండాలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తలకొండపల్లి: అంగన్‌వాడీ టీచర్స్ ,సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య అన్నారు. కనీసం నెలకు రూ. 26,000 వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కరుమయ్య మాట్లాడుతూ.. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత , తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 10 లక్షలు, హెల్పర్లకు రూ. 5 లక్షలు చెల్లించాలని, రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుష్పమ్మ, అనంతమ్మ, గిరిజ, యాదమ్మ, మల్లమ్మ, రాజ్యలక్ష్మి, పద్మభూషణమ్మ, శైలజ, భాగ్యలక్ష్మి, సువర్ణదేవి, స్వరూప పాల్గొన్నారు.